

ఆశ్చర్యంగా చూశాడు పరాశరుడు.

''జగన్నాథమా!?.. మీరు వైష్ణవులా??''.

ఈసారి ఆశ్చర్యపోవడం జాయపుని వంతయ్యింది.

''వైష్ణవం ఏమిటీ?.. అది నా పేరు అంతే!!''.

''పైన వీభూతి రేఖలు.. పేరు జగన్నాథం! భలే భలే! మాకాడ అట్టా కుదరదు. ఏ మతం వోళ్లు ఆ దేవుళ్ల పేర్లే పెట్టుకుంటారు. నువ్వు శైవుడివి అయితే శివనామం లేదా రుద్ర, ఈశ్వర.. లాంటి పేర్లు పెడతారుకదా పెద్దోళ్లు. అందుకని అడిగా!''.

నిర్ఘాంతపోయాడు జాయపుడు. తనకు తెలియని ప్రపంచం చాలా ఉన్నదని ఇటీవల.. వెలనాడు వచ్చిన ప్పటి నుంచీ అనిపిస్తున్నది.

''సరే సరే.. ఏం చేస్తుంటావ్ మిత్రమా?''.

''గేయ కవిని. నిజం చెప్పాద్దూ.. ఈ గేయనాటకం రాసింది నేనే..'' అన్నాడు సాధారణంగా.

''అవునా!? మరి ఈ ప్రేక్షకపాత్ర ఏమిటి?''.

''నా రచన ప్రదర్శనగా ఎలా ఉందో ప్రేక్షకుల్లో కూర్చుని పరిశీలిస్తుంటాను. మాది గుద్రవాడ ప్రాంతం కృష్ణాతీరం''.

''ఈ రాజ్యమంతా కృష్ణాతీరమే. ఇక్కడ కృష్ణమ్మ ఎన్నో పాయలైతే అన్నిపాయల చుట్టూ గ్రామాలే కదా!? ఏ ఊరు పేరు చెప్పినా కృష్ణాతీరమే!''.

''అవునూ.. మీది అనుమకొండ అన్నారు కదా!? నాట్యం ఎక్కడ అభ్యసించారు?''.

వెలనాటి గరుకు, యాస తగ్గించి.. పరాశరుడు పండి తునిలా మాట్లాడటం జాయపుడు గుర్తించాడు.

''గుండయామాత్యులవారు మా గురుదేవులు''.

పూర్తిగా జారిపోయాడు పరాశరుడు.

''ఓహ్..'' అంటూ భక్తిగా ఆరాధనపూర్వకంగా జాయపుణ్ని చూశాడు.

''అమ్మో.. సాక్షాత్తూ గుండయామాత్యులవారి శిష్యు లంటే.. మీరు నాట్యంలోనే కాదు. గీతం, గానం, వాద్యం.. అన్ని కళారూపాలలో సంపూర్ణ ప్రజ్ఞావంతులు!''.

అందులో ఏ అర్హత చెప్పినా జాయపుని శరీరాకృతి సరి పోలుతుంది. ప్రతి పదంలోనూ గొప్ప గౌరవాన్ని పలికిస్తు న్నాడు పరాశరుడు ఇప్పుడు. జాయపునికి కూడా కొంత పులకింతగానే ఉంది. అనుమకొండ దాటాక అతని పూర్ణ ప్రజ్ఞను గుర్తించి గౌరవించడం తిమ్మిరి తిమ్మిరిగా ఉంది.

'అప్పుడు పిల్లవాణ్ని. ఇప్పుడు పెద్దవాణ్ని. భలే.. చాలా బావుంది!' హుషారుగా నడుస్తూ వెలనాడు ప్రాంతపు నాట్య, సంగీత, గేయ, వాద్య సంప్రదాయాలను అడుగు తున్నాడు జాయపుడు. వినయంగా వివరిస్తున్నాడు పరా శరుడు. ఇద్దరికీ మంచి మైత్రి కుదిరింది. తాను మండలే శ్వరుడినని చెప్పలేదు. యుద్ధ వీరుడిననీ, కాకతీయరాజ్య గజసాహిణీననీ అస్సలు చెప్పలేదు.

అతను రచించిన గేయనాట్య తర్వాతి ప్రదర్శన ఎక్కడో చెబుతాడు పరాశరుడు. ఇద్దరూ అక్కడ కలుస్తారు. ఇద్దరూ నిత్యమూ కలవడం.. నువ్వూ అంటే నువ్వూ అని పలక రించుకోవడం వరకూ వచ్చారు. పరాశరుడు గుద్రవాడ ప్రాంతం నుంచి ధనదుపురం వచ్చినప్పుడు ఓ కవి మిత్రుని ఇంట ఉంటాడు. ఆ మిత్రుని పేరు పెద్దనార్య. పరాశరుడు జాయపుణ్ని పరిచయం చేశాడు.

''వెలనాడు పండితులకు, కవిగాయక కళాప్రకాండు లకు పెద్దన నివాసం ఓ కళాగృహం.. సాహిత్య చర్చావేదిక. చుట్టుపక్కల గ్రామాలనుంచి కవులు, పండితులు సంధ్య వేళకు ఇక్కడికి చేరతారు. మనం సంధ్యవేళకు వస్తే బోలె డుమంది కలుస్తారు. అబ్బో.. కబుర్లే కబుర్లు. సాహిత్యచ ర్చలతో ఈ ఇల్లంతా హోరెత్తిపోతుంది. ఇక ఆతిథ్యానికి మా పెద్దన జంట పెట్టింది పేరు. తినుబండారాలకు, భోజ నానికి లోటులేదు. రాత్రి రేవు దాటలేని వాళ్లకు నిద్రకు ఏర్పాట్లున్నాయి. వెనుక గుర్రపుశాల కూడా ఉంది''.

ఈ పెద్దన నాగంభట్టులా కాస్త కుదమట్టంగా నిండుగా ఉన్నాడు. జాయపునికి నచ్చాడు. ఇద్దరూ తర్వాత చాలా సార్లు అక్కడికి వచ్చారు. పాతిక ముప్పైమంది కవి పండి తులు మిత్రులయ్యారు.

ఓరోజు కబుర్ల మధ్య భల్లాటుడు అనే కవి ఓ పద్యాన్ని పాటలా ఎత్తుకున్నాడు.

**''తలచిన దెందము కందును**
**పలికిన నోరెల్ల పొక్కు ప్రభ సూచిన రె**
**ప్పలు కమరుననగ పటుతర**
**విలయానల భాతినెండ వేసవి గాచెన్..''**

కాసేపు రాగం తీసి తీసి ఆపాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

''బాగుంది బాగుంది.. తలచిన డెందము కందును. తలిస్తేనే మనసు కందిపోతుంది. ఓహో!''..

''పలికితేనే నోరు పొక్కుతుంది. ఒహోహో!''..

''రెప్పలు కమరడం.. అద్భుతం! వేసవిమీద భలే పజ్జెం కట్టావోయ్ మిత్రమా!''..

మిత్రులు అందులోనున్న అంతరార్థాన్ని వివరిస్తూ మైమరచారు.

''జాను తెలుగు అన్నాడోయ్ మన గురువు నన్నెచోడుడు..'' అన్నాడు పద్యం చెప్పిన భల్లాటుడు.

''అవునవును.. దేశీ కవితకు పట్టం కట్టాడాయన''..

నన్నెచోడుడు క్షత్రియ కవి. మండలేశ్వరుడు. ఆయనను కొంత చదివిన జాయపుడు ఉత్సాహంగా చూశాడు.

ఇప్పుడు వెలనాడు పండితులకు తెలుగు పిచ్చి పట్టు కుంది. ముఖ్యంగా దేశీ తెలుగు. ఈ పిచ్చి ఎంతగా వ్యాపిం చింది అంటే.. ఇటీవల పెద్దలు పెట్టిన పేర్లు కూడా సంస్కృత వాసన కొడుతున్నాయని వాటిని తెలుగు పేర్లుగా మార్చుకుంటున్నారు ఈ కుర్రపండితులు.

భైరవుడు బయ్యన.. భాస్కరుడు బాచన.. జగన్నా థుడు జగ్గన.. ఇలా.

ఇప్పుడు తెలుగు పండితులకు ప్రత్యేక ఆకర్షణ తిక్కన. తొండనాడులోని తిరుకాళత్తి దేవునిపేరు తల్లిదండ్రులు పెట్టగా.. 'తిక్కన' అని మార్చుకున్నాడని ఇక్కడ చెప్పుకో వడం విని 'ఔరా!' అనుకున్నాడు జాయపుడు.

''నన్నెచోడుడు పద్యం, గద్యం కలిపి రాసిన విధానం విప్లవాత్మకంగా ఉంది. ఆ పద్ధతిని చంపూ అనొచ్చు..'' మరో పండితుడు.

''చంపావ్ పో! చంపూ ఏమిటి.. చంపూ.. నరుకు.. గొంతు కొయ్..'' అన్నాడు మరొక యువకవి.

అందరూ ఘొల్లున నవ్వారు.

''చంపూ పద్ధతి అని ఆయనే అన్నారా..
నువ్వు పెట్టావా!? దానికి అర్థమేమిటి?'' మరోకవి పరిహాసపు కుతూహలం.

''చప్పనయ్యా.. చప్పనంటే చప్పను! అలా నోటికి వచ్చే సింది. అనేశాను. ఏం.. నచ్చలేదా?''.

''నచ్చలేదా అంటే నచ్చిందో లేదో ఇంకా నిర్ణయించు కోలేదు. దీని భావమేమి.. ఈ చంపూ అనేది సంస్కృ తంలో, ప్రాకృతంలో.. లేదంటే తెలుగన్నడలో ఉందా?''.

''ఏమో మహానుభావా.. తెలియదు. నా మనసులో పుట్టింది పెట్టేశాను''.

అందరూ అంగీకరిస్తున్నట్లు నవ్వుతుండగా, మరో కవి అన్నాడు.

''అయితే వెయ్యండ్రా. వీరతాళ్లు.. నాలుగు!''.

''వీరతాళ్లా.. మరొక కొత్తపదం.. జాను తెలుగు''.

పండిత కవుల ఏకగ్రీవ నవ్వులు చప్పట్లలో ఆ మందిరమంతా పరిమళించింది.

వీరిలో మౌఖిక, శ్రుత సంప్రదాయంలో వేదవేదాం గాలు ఏమాత్రం వత్తు, రేఫ తప్పులేకుండా వల్లెవేసి వేసి.. రాటుదేలిపోయిన పండిత వంశాలవారే ఎక్కువమంది. తాత తండ్రులిచ్చిన కఠినమైన ప్రాథమిక శిక్షణ, సాధన వల్ల సంస్కృతం, ప్రాకృతం భాషలపై అపారమైన పట్టున్న వాళ్లే అంతా. మాతృభాషలో ప్రతిపనికీ తగిన తెలుగు భాషా పదాలను సృష్టించడం చూసి జాయపుడు ఆశ్చర్య పోయాడు. అదే అడిగాడు.

''ప్రతి సంస్కృత పదాన్నీ తెలుగు చేయాల్సిన అవసరం ఉందా?'' అని..

''ఉంది. ఉందిగాక ఉంది. దీనినే 'తెలుగు నిలుపుట' అన్నాడు నన్నెచోడుడు. మన రాజ్యం, మన భాష. మన ప్రజలు మాట్లాడుకునే ప్రతిపనికీ తగిన పదం కట్టాలి. ఒకప్పుడు సంభాషణ ప్రాకృతం, తర్వాత తెలుగన్నడ, తెలుగుతమిళం, తెలుగుమరాఠం అనేవాళ్లం. ఇప్పుడు తెలుగు, తమిళం, కన్నడం, మరాఠీ వేరువేరైనాయి. ఇప్పుడు మన భాషనూ పరిపుష్టం చేసుకోవాలి. ప్రజలు మాట్లాడే పదాలు, వాక్యాలు చాలా సాధారణంగా ఉంటాయి. అవన్నీ గ్రంథస్తం చేయాలంటే ముందు వాటిని సంస్కరించాలి''.

''ప్రజల భాష అది. దానిలోనే అందం చందం ఉంటాయి. అదే దేశీ అంటున్నాం కదా. ఇక సంస్కరించడం ఏమిటి''.. జాయపుని సందేహం.

''వాళ్లువాగే ప్రతిమాట దేశీ అయినా కొంత సంస్కరించి కవులం.. సాహితీరూపంలోకి ఒదిగేలా గ్రంథస్తం చేస్తాం!''.

''అంటే అప్పుడు మార్గి అవుతుందా?''.

**(సశేషం)**